
సాక్షి గుంటూరు

సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024




పర్యాటకుల సందడి

విజయపురిసౌత్: నాగార్జునకొండలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. లాంచీల ద్వారా రూ.42,000 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 5000 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1122 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ నీటి మట్టం ఆదివారం 588.90 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 6,041, ఎడమ కాలువకు 5,438 క్యూసెక్కులు వదులుతున్నారు.

న్యూస్‌రీల్

బంగారు తాపడం పనులకు రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రి దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు దుగ్గిరాలకు చెందిన భక్తుడు ఆదివారం రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. దుగ్గిరాల బ్రాహ్మణవీధికి చెందిన కే శివనాగేశ్వరరావు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి బంగారు తాపడం పనులకు రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. అనంతరం దాతకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.

3 వరకు ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ జాతీయ ప్రతిభా ఉపకార వేతనం (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష దరఖాస్తుకు తుది గడువు అక్టోబర్ 3వ తేదీతో ముగియనుంది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఆదివారం తెలిపారు. ఆలోగా నమోదు చేసుకున్న విద్యార్థుల ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రసీదును డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. బీఎస్ఈ.ఏపీ.జీవో వీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు సమయంలో విద్యార్థులు తమ కుల, ఆదాయ ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. విద్యార్థి సంతకంతో ఉన్న పాస్‌పోర్ట్ సైజు ఫొటో అప్‌లోడ్ చేస్తే సరిపోతుందన్నారు. విద్యార్థులు ఉపకార వేతనాన్ని పొందేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని సూచించారు.

గ్రామ పంచాయతీ కార్యకలాపాలపై శిక్షణ



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ 2024–25, పంచాయతీ రాజ్ చట్టంపై గుంటూరు జిల్లా పరిధిలోని ఎంపీడీవోలు, ఈవో పీఆర్డీలకు జెడ్పీ సమావేశ మందిరంలో మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా పంచాయతీ ఆస్తులు, వాటి పరిరక్షణ, ప్రభుత్వ నిబంధనలు, చట్టంలో పొందుపర్చిన అంశాలతోపాటు విధి నిర్వహణలో న్యాయపరమైన అంశాలను రీసోర్స్ పర్సన్ బొంతా సుబ్బారావు వివరించారు. గ్రామ పంచాయతీలో వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తల వంటి అంశాలపై పి.నాగానంత్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై చేబ్రోలు ఈవో పీఆర్డీ బి. శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ వ్యవస్థ, పరిపాలనలో కేంద్ర, ప్రభుత్వాలు తీసుకువచ్చిన నూతన పాలసీలు, విధివిధానాలపై సమగ్రంగా అందరికీ వివరించారు.

మల్లేశ్వరుని సన్నిధిలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



పెదకాకాని: శ్రీ మల్లేశ్వరస్వామి వారి సన్నిధిలో మూడు రోజుల పవిత్రోత్సవాలు ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. తెలిసీతెలియక చేసే పొరపాట్ల వల్ల కలిగిన దోషానికి పరిహారం కోసం చేసే పూజా క్రతువులే పవిత్రోత్సవాలు అని స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు తెలిపారు. ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్ మాట్లాడుతూ.. వేడుకల్లో భాగంగా ఉదయం యాగశాల ప్రవేశం, శివానుజ్ఞ శ్రీ విఘ్నేశ్వరపూజతో కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. రెండవ రోజు పవిత్ర సమర్పణ, విశేష ద్రవ్య హోమం, పూర్ణాహుతి, ఉపచారం, మంత్రపుష్పం, హారతి, విబూది, కుంకుమ ప్రసాద పంపిణీ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకులు పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు, దాతలు రెడ్డి నవీన్‌కుమార్ – విజయలక్ష్మి దంపతులు, నీలివెల్లి కోటేశ్వరి, కుటుంబసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాబు రాగానే జాబుకు ఎసరు!

- అక్టోబర్ 1 నుంచి అమల్లోకి నూతన మద్యం పాలసీ
- అగమ్యగోచరంగా షాపుల్లోని 558 ఉద్యోగుల పరిస్థితి
- తమకు తగిన న్యాయం చేయాలని బాధితుల డిమాండ్

బాబు వస్తే జాబు అన్నారు... కూటమి ప్రభుత్వం వచ్చాక ఉన్నదే ఊడగొడుతున్నారు. కొత్త మద్యం పాలసీ తెచ్చి ఆ దుకాణాల్లో ఇప్పటికే పనిచేస్తున్న ఉద్యోగుల భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేశారు. వంద రోజుల పాలనలో ప్రస్తుతం తీసుకొచ్చిన ఈ విధానం ఎన్నో కుటుంబాల జీవనాన్ని దెబ్బతీయనుంది. మరికొన్ని రోజుల్లో మరింత మందికి ఎసరు పెడతారనే చర్చకు బీజం పడింది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని బాధిత ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

నెహ్రూనగర్: నూతన మద్యం పాలసీ తీసుకొచ్చి పలువురి ఉద్యోగాలకు ప్రభుత్వం ఎసరు పెట్టింది. అక్టోబర్ 1 నుంచి ఈ పాలసీ అమలు కానుంది. దీంతో వీరిలో ఆందోళన నెలకొంది. అక్రమాల కట్టడికి, బెల్టు షాపుల నియంత్రణకు ప్రభుత్వ మద్యం షాపుల నిర్వహణకు ఉద్యోగులను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వ పర్యవేక్షణలోనే మద్యం విక్రయాలు నిర్వహించింది. ఈ క్రమంలో పలువురు నిరుద్యోగులకు అవకాశాలు చూపించింది. సూపర్‌వైజర్, సేల్స్‌మెన్, నైట్ వాచ్‌మెన్ తదితర ఉద్యోగాల ద్వారా ఒక్కో షాపులో నలుగురు నుంచి ఐదుగురి వరకు ఉపాధి కల్పించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు సిద్ధమవుతుండటంతో తమ భవిష్యత్ ఏంటని వారంతా ఆందోళన చెందుతున్నారు.

స్పందించని కూటమి ప్రభుత్వం

2019కి ముందు మద్యం దుకాణాలకు ప్రతి రెండేళ్లకోసారి టెండర్లు పిలిచేవారు. లాటరీ పద్ధతిన ప్రైవేట్ వ్యక్తులకు దుకాణాలు కేటాయించేవారు. కొన్ని ముఖ్యమైన దుకాణాలకు డిమాండ్ ఉండేది. ప్రైవేట్ దోపిడీని అరికట్టేందుకు 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ సర్కారు ప్రభుత్వ దుకాణాలకు శ్రీకారం చుట్టింది. అవినీతి, అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఏపీ రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ తరఫున అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ఇంటర్వ్యూలు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ల ద్వారా నియామకాలు చేపట్టింది. అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది. గుంటూరు జిల్లాలో 120 మద్యం షాపులు ఉన్నాయి. వీటిలో సూపర్‌వైజర్లు 120 మంది,



గుంటూరు అరండల్‌పేటలోని ప్రభుత్వ మద్యం దుకాణం

సేల్స్‌మెన్స్ 318, నైట్ వాచ్‌మెన్‌లు 120 మంది ఉన్నారు. సూపర్‌వైజర్లకు నెలకు రూ.21,500, సేల్స్‌మెన్లకు రూ.18,500, నైట్ వాచ్‌మెన్లకు రూ.10 వేల వంతున వేతనంగా చెల్లిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీతో వీరందరూ రోడ్డున పడనున్నారు.

నేడు వినతిపత్రాల అందజేత

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని బాధితులు వేడుకుంటున్నారు. ఈ నెల 30వ తేదీతో ఉద్యోగుల కొనసాగింపు గడువు ముగియనుండటం.. తదుపరి ఆదేశాలు రాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. 30న డిపో మేనేజర్‌ను కలిసి తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తేనే విధులకు హాజరవుతామని వినతి పత్రాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం నుంచి హామీ రాని పక్షంలో ఒకటో తేదీ నుంచి విధులకు హాజరయ్యేది లేదని ఏపీసీఓఈడబ్ల్యూ అసోసియేషన్ నాయకులు స్పష్టం చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



కూటమి సర్కారు కొత్త పాలసీ తీసుకురావడం ద్వారా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న వేల మంది కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉంది. 2023–24 పాలసీ ప్రకారం ఉద్యోగుల కొనసాగింపు గడువు 30వ తేదీతో ముగుస్తుంది. తదుపరి షాపుల కొనసాగింపునకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ఇంత వరకు ప్రభుత్వం నుంచి స్పందనే లేదు. మాకు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్తంగా సోమవారం డిపో మేనేజర్‌లకు మా ఇబ్బందులపై వినతి ప్రతాలు అందజేయనున్నాం. ఒకటో తేదీ నుంచి విధులకు హాజరు కాబోమని చెబుతాం.

– జె. కోటేశ్వరరావు, ఏపీసీఓఈడబ్ల్యూ స్టేట్ సెక్రటరీ

మిర్చి రైతుకు ఖర్చుల మంట

గుంటూరు మిర్చికి దేశవ్యాప్తంగా మంచి పేరుంది. ఈ ప్రాంతంలో పండించే మిరప పంటకు డిమాండ్ ఎక్కువే. వాణిజ్య పంటగా పేరున్న మిర్చి సాగుపై ఈ ఏడాది రైతులు అంతగా ఆసక్తి చూపలేదు. పెరిగిన పెట్టుబడులు, విపత్తులు, ధరల పతనం ఫలితంగా గత ఏడాదితో పోల్చితే ఈసారి జిల్లాలో వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది.

- జిల్లాలో భారీగా పడిపోయిన పంట సాగు
- ఆర్థిక భారంతో ఈ ఏడాది వెనుకడుగు

ప్రత్తిపాడు: గుంటూరు జిల్లాలో 2022–23 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో 30,295 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. అదే ఏడాది రబీలో 15,708 ఎకరాల్లో పంట వేశారు. 2024–25 ఖరీఫ్‌లో మాత్రం ఇప్పటి వరకు కేవలం 6,630 ఎకరాల్లోనే సాగు చేశారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. పంట సాగుకు పెట్టుబడులు అధికం అవుతుండటంతో రైతులు అప్పులు చేయాల్సి వస్తోంది. కౌలుతో కలిపి ఎకరాకు సుమారు రూ. లక్షన్నర నుంచి రూ. రెండు లక్షల వరకు పెట్టుబడి అవుతోంది. ఇంతా చేసి సాగు చేసినా దిగుబడులు చేతికొచ్చే సమయానికి ప్రకృతి సహకరించడం లేదు. దీంతో కాయలు తడిసి ముద్దవుతున్నాయి. గత ఏడాది తుపాను ప్రభావం మిర్చి రైతులపై కోలుకోలేని విధంగా పడింది. అంతకుముందు ఏడాది కూడా నల్లి తామర పురుగు ఆవహించడంతో పంట పూర్తిగా చేతికిరాని పరిస్థితి ఏర్పడింది. ఎంతో మంది రైతులు పంటను మధ్యలోనే తొలగించాల్సి వచ్చింది. రకరకాల తెగుళ్లు పంటలపై దాడి



చేస్తుండటం కూడా ఇంకొక కారణం.

ధరల పతనంతో కుదేలు

ఇలా గడిచిన నాలుగు సంవత్సరాలుగా ఏదో ఒక రూపంలో మిర్చి రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారు. ఇన్ని అగచాట్లు పడి పంటను దక్కించుకున్నా ధరలు లేకపోవడం కూడా పంట సాగు తగ్గడానికి కారణమని రైతులు చెప్పారు. గత సంవత్సరం రూ. 25 వేలు పలికిన క్వింటా మిర్చి ధర ప్రస్తుతం రూ. 10 వేలకు పడిపోయింది. దీంతో ధరలు లేక, రూ. వేలు పెట్టుబడులు పెట్టి సాగు చెయ్యలేక ఇతర పంటలపై రైతులు దృష్టి పెట్టారు. ప్రత్తిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు వంటి మండలాల్లో సాగర్ ఆయకట్టు చివరి భూములు ఉన్నాయి. ఇక్కడ తుపానులు, తెగుళ్ల బెడద లేకపోయినా సాగు నీటి సమస్య వెంటాడుతోంది.

ఈ ఏడాది సాగు చేయలేదు



గత సంవత్సరం వరకూ ప్రతి ఏటా పది నుంచి ఇరవై ఎకరాలు మిర్చి సాగు చేశా. వాతావరణం అనుకూలించక దిగుబడులు తగ్గిపోవడం, మార్కెట్‌లో ధరలు రాకపోవడం.. ఇలా అన్నీ ఇబ్బందులే. కూలీ ఖర్చులూ విపరీతంగా ఉంటున్నాయి. ఎకరాకు రూ.లక్షన్నరకు పైగా పెట్టుబడి అవుతోంది. కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. అందుకే ఈ ఏడాది ఒక్క సెంటు కూడా మిర్చి సాగు చేయలేదు. కనీస మద్దతు ధర ఉండే పరిస్థితి కనిపించడం లేదు.

– భట్టిపాటి శ్రీనివాసరావు, రైతు, ప్రత్తిపాడు

పెట్టుబడులూ రాని దుస్థితి



గతంలో రూ.ఇరవై నుంచి రూ.పాతిక వేల వరకు క్వింటా మిర్చి ధర ఉండేది. గత ఏడాది రూ. పదివేలకు పడిపోయింది. తుపానుల ప్రభావంతో పంట దిగుబడులూ తగ్గాయి. కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఎదురవుతోంది. గత నాలుగు సంవత్సరాలుగా ఇదే దుస్థితి. అందుకే ఈ ఏడాది మిర్చి పెద్దగా సాగు చేయలేదు. ఏటా పదిహేను ఎకరాలు సాగు చేసే నేను ఈ ఏడాది ఐదెకరాలతో సరిపెట్టా.

– అంబటి అంజిరెడ్డి, రైతు, ప్రత్తిపాడు

అభివృద్ధి పనులకు 'ఇసుక' పోటు

- ధర తగ్గాక ప్రారంభిస్తామంటున్న కాంట్రాక్టర్లు
- రూ.వంద కోట్ల వరకు ఆగిపోయిన పనులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు సుముఖత వ్యక్తం చేయడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు వేగంగా సాగాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడ్ కారణంగా చాలావరకు మధ్యలోనే ఆగిపోయాయి. ఇప్పుడు ఇసుక సరఫరా అంతంత మాత్రంగా ఉండటంతో కాంట్రాక్టర్లు ఆయా పనులు చేసేందుకు ముందుకురాని పరిస్థితి నెలకొంది. ఈ నెలలో కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ చాలా వరకు కోతకు గురయ్యాయి. వాహనచోదకులు ప్రయాణం చేసే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి చోట్ల రోడ్డు నిర్మాణాలు కూడా ఆగిపోయాయి.

కొనలేని పరిస్థితి

గుంటూరు నగరపాలక సంస్థ గత ప్రభుత్వం హయాంలో రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టింది. నగరంలో రోడ్లు, డ్రైన్లు లేని చోట వాటిని నిర్మించారు. ఎన్నికలకు ముందు కూడా రూ. కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి. అయితే ఎన్నికల కోడ్ రావడంతో



సంజీవయ్యనగర్‌లో రహదారి నిర్మాణానికి ఇసుక లేక నెల కిందట పోసి వదిలేసిన కంకర

ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నూతన ఇసుక పాలసీ తీసుకువచ్చింది. దీంతో ఇసుక కొనలేని పరిస్థితి కాంట్రాక్టర్లకు ఎదురైంది. అభివృద్ధి పనులు చేపట్టలేక వారు మౌనంగా ఉండాల్సిన పరిస్థితి.

రూ.35 వేలకుపైనే లారీ ఇసుక ధర

పెద్ద లారీ ఇసుక లోడు గుంటూరు నగరానికి రావడానికి రూ.35 వేలు పైనే వసూలు చేస్తున్నారు. కాంట్రాక్టర్లు ఈ రేటు చూసి విస్తుపోతున్నారు. ఒక పక్క అధికారులు పనులు ప్రారంభించాలని ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇసుక రేట్లు తగ్గిన తరువాతే పనులు ప్రారంభిస్తామని తెగేసి చెబుతున్నారు కాంట్రాక్టర్లు. నగరపాలక సంస్థ అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజలు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు.

తమ్ముళ్ల దందాకు తాత్కాలిక చెక్

ఉన్నతాధికారుల హెచ్చరికతో ఎట్టకేలకు స్పందించిన పోలీసు శాఖ

తాడికొండ: తుళ్ళూరు మండలం బోరుపాలెం గ్రామంలో రాత్రి సమయంలో నిరంతరాయంగా అక్రమ తవ్వకాలు చేస్తున్న ఇసుక దందాకు తాత్కాలికంగా చెక్ పడింది. రాత్రి సమయంలో అనధికారికంగా కాసులిచ్చి మరీ దందా నడిపిస్తున్న తెలుగు తమ్ముళ్ల వ్యవహారం పరాకాష్టకు చేరడంతో పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి విషయం చేరింది. వారు హెచ్చరించడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. ఆదివారం రాత్రి హడావుడిగా గండి కొట్టించారు. తుళ్ళూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు స్వయంగా దగ్గరుండి మరీ జేసీబీ సాయంతో గుంత తవ్వించారు. వారం రోజుల క్రితం తహసీల్దార్ సుజాత కూడా ఇదే తరహాలో గండి కొట్టించారు. రెండు రోజులు తాత్కాలిక విరామం ప్రకటించిన తమ్ముళ్లు మళ్లీ గండి పూడ్చి యథావిధిగా రాత్రి వేళ అక్రమ తవ్వకాలు మొదలు పెట్టేశారు. పోలీసు శాఖలోని ఓ కానిస్టేబుల్ రాత్రి వేళ ఒక్కో వాహనానికి కొంత రేటు కట్టి వసూలు చేస్తుండటంతో యథేచ్ఛగా ఈ దందా కొనసాగుతోంది. నిఘా వర్గాల ద్వారా సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ.. దీనిపై నేరుగా స్పందించారు. బాధ్యులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఎట్టకేలకు పోలీసులు స్పందించాల్సి వచ్చింది. ఇది ఇంతటితో ఆగుతుందా లేక మళ్లీ మొదలవుతుందా అంటే వేచి చూడాల్సిందే.

రెవెన్యూ జిరాక్స్ బిల్లుల దందాపై ఆగ్రహం

తాళ్ళాయపాలెం, లింగాయపాలెం ఇసుక స్టాక్ పాయింట్‌ల వద్ద జరిగిన లోడింగ్ వ్యవహారంలో రెవెన్యూ శాఖ జిరాక్స్ బిల్లుల దందా భారీగా నడిచింది. ఇందులో రెవెన్యూ శాఖలోని ఓ వీఆర్వో,



బోరుపాలెం ఇసుక రీచ్ వద్ద వాహనాలు లోపలికి వెళ్లకుండా గండి వేయిస్తున్న పోలీసులు

గ్రామ సహాయకుడి సహకారంతో పెద్ద ఎత్తున జిరాక్స్ తీసిన బిల్లులు పెట్టి సంతకాలు, స్టాంప్‌లు వేశారు. ఆ నకిలీ బిల్లులతో పెద్ద ఎత్తున ఇసుకను తరలించారు. ఆన్‌లైన్‌లో జరిగిన బుకింగ్‌కు, స్టాక్ పాయింట్ వద్ద లోడింగ్‌కు పొంతన లేకుండా అధికంగా ఇసుక తరలి వెళుతున్నట్లు తేలడంతో ఆర్డీవో తదితర అధికారులు సిబ్బందిని హెచ్చరించారు. రెవెన్యూ శాఖ వ్యక్తులు, వెలుగు విభాగ సిబ్బంది దగ్గరుండి మరీ వాహనాలను పంపిస్తున్నారు. ఇద్దరి సమన్వయంతో ఈ దందా నడిచిందా లేక ఎవరి ప్రమేయం ఎంత అనే దానిపై ఆరా తీసే పనిలో అధికారులు ఉన్నారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో ఓ వీఆర్వో, గ్రామ సహాయకుడి ప్రమేయం ఉందని తేల్చి నిలదీయడంతో వారు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకొన్నారు. అందుబాటులో లేకుండా తిరుగుతున్నట్లు సమాచారం. దీనిపై తహసీల్దార్ సుజాతను వివరణ కోరగా.. లోడింగ్ జరిగిన బిల్లులు వెరిఫికేషన్ చేస్తున్నామని, పూర్తిగా పరిశీలిస్తే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందన్నారు.

హిందీ ప్రచారంలో మేటి!

- ప్రేమీమండలి మహావిద్యాలయం ప్రత్యేకత
- 2న వార్షిక గురుపీఠ పురస్కారాల ప్రదానానికి చురుగ్గా ఏర్పాట్లు

హిందీ ప్రేమీమండలి మహావిద్యాలయం అంటేనే భాషా పరిరక్షణలో మేటి అన్నట్లుగా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. హిందీ ప్రచారంతోపాటు ఆ దిశగా విశేష కృషి చేసిన వారిని గుర్తించి ఘనంగా సత్కరిస్తోంది. అంతేకాదు వార్షిక హిందీ ప్రచార గురుపీఠ పురస్కారాలను ప్రదానం చేసి వారి సేవలు నలుగురికి తెలిసేలా స్ఫూర్తి నింపుతోంది.



హిందీ ప్రేమీమండలి మహావిద్యాలయం

తెనాలి: స్థానిక నాజరుపేటలోని హిందీ ప్రేమీ మండలి మహావిద్యాలయంలో అక్టోబరు 2న మహాత్మాగాంధీ జయంతి, బోయపాటి నాగేశ్వరరావు– సుభద్రాదేవి గురు దంపతుల 22వ వార్షిక హిందీ ప్రచార గురుపీఠ పురస్కార ప్రదానోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షతన ఏర్పాటయ్యే ఈ ప్రత్యేక సభలో హిందీ ప్రచారంలో విశేష కృషి చేసిన ఇద్దరు ప్రముఖులకు గురుపీఠ పురస్కారాలు అందించి, సత్కరిస్తారు. ఏలూరులోని సర్ సీఆర్ రెడ్డి కాలేజీ హిందీ విభాగం, విజయవాడలోని దక్షిణ భారత హిందీ ప్రచారసభ (మద్రాసు) స్నాతకోత్తర కళాశాల విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కొల్లి మోహనరావు, విశాఖపట్నంలోని నేవీ చిల్డ్రన్ స్కూల్ సీనియర్ హిందీ అధ్యాపకురాలు డాక్టర్ నిర్మలాదేవి చిట్టిళ్ల హిందీ గురుపీఠ పురస్కారాలను స్వీకరిస్తారు.

దశాబ్దాల చరిత్ర

రాష్ట్రంలో వందేళ్లకుపైగా జరుగుతున్న జాతీయ భాష హిందీ ప్రచారోద్యమంలో ప్రేమీ మండలికి ఎనిమిదిన్నర దశాబ్దాల చరిత్ర ఉంది. స్వాతంత్ర్య ఉద్యమంలో హిందీ ప్రచారానికి అంకురార్పణ జరిగింది. 1919లో మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాల, తెనాలిలోని తిలక్ జాతీయ విద్యాలయం హిందీ ప్రచారాన్ని ఉద్యమంగా ఆరంభించాయి. దీని విశిష్టతను తెలుసుకున్న గాంధీజీ 1929 ఏప్రిల్ 19న ఈ విద్యాలయాన్ని సందర్శించారు. ప్రత్యేకంగా తెప్పించిన రంగూన్ టేకు స్తంభంపై జాతీయ జెండాను ఏర్పాటు చేయగా, గాంధీ ఆవిష్కరించారు. 1930లో ఉప్పు సత్యాగ్రహం చేసేవారు ఈ విద్యాసంస్థను క్యాంపుగా చేసుకున్నారు. తర్వాత ఏర్పడిన ఆవాంతరాలతో విద్యాలయం మూతపడింది. జాతీయ భాషా ప్రచారం నిమిత్తం హిందీ ప్రేమీమండలి మహావిద్యాలయాన్ని అదే ప్రదేశంలో 1938లో గాంధీ స్థాపించారు. ఇందుకు చిట్టూరి లక్ష్మీనారాయణ శర్మ కృషి చేయగా, మద్ది వెంకటరంగయ్య, మల్లాది దేవేంద్రుడు, ఇటికాల సూర్యనారాయణ సహకరించారు. గాంధీజీ వచ్చి సందేశమిచ్చిన ప్రదేశాన్ని గాంధీ శిబిరంగా ప్రత్యేకంగా ఉంచారు. అప్పట్నుంచి ప్రారంభిక నుంచి స్నాతకోత్తర పరీక్షల వరకు విద్యాబోధన చేశారు. 1.50 లక్షల మందికి పైగా విద్యార్థులు శిక్షణ పొందారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ సహకారంతో 1954లో హిందీ ప్రచారక్ ప్రశిక్షణ మహావిద్యాలయం స్థాపించారు. అయిదు వేల మంది ఇక్కడ చదివి ఉత్తీర్ణులై ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా హిందీ బోధనలో ఉన్నారు. ఇప్పటికీ ప్రాథమిక నుంచి విశారద, ఉత్తరార్ధ వరకు బోధిస్తున్నారు హిందీ బోధనతోనే సరిపెట్టుకోకుండా ప్రచార సాఫల్యానికి వివిధ కార్యక్రమాలను ప్రేమీ మండలి నిర్వహిస్తోంది. హిందీ వేసవి తరగతులు, రాత్రి పాఠశాలలు, పలువురు మహిళలకు మెహిందీ, ఎంబ్రాయిడరీ తరగతులు, హిందీ విజయపత్ర వితరణ ఉత్సవాలు, నాటక ప్రదర్శనలు, మహాసభలు నిర్వహించింది. ఇక్కడ నాలుగు వేల పుస్తకాలతో గ్రంథాలయం కూడా ఉంది.



డాక్టర్ కొల్లి మోహనరావు




డాక్టర్ నిర్మలాదేవి చిట్టిళ్ల

అంచెలంచెలుగా ఎదుగుదల

పూరి పాకలో మొదలైన ప్రేమీ మండలికి 1967లో అప్పటి ఆర్డీవో రామకృష్ణ పరమహంస ప్రజల సహకారంతో రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించి ఇచ్చారు. కన్నెగంటి వెంకట్రామయ్య తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మహిళా వసతి గృహాన్ని నిర్మించారు. వజ్రోత్సవాల సందర్భంగా హిందీ ప్రచారకులకు శిక్షణ నిమిత్తం మూడంతస్తుల గాంధీ శిబిర భవనాన్ని ప్రారంభించారు. 1992 నుంచి సంస్థ అధ్యక్షుడిగా డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి కొనసాగుతున్నారు. కార్యదర్శి / కరస్పాండెంట్‌గా బోయపాటి కుటుంబసభ్యుల్లో ఒకరైన డాక్టర్ ఈలప్రోలు శ్రీనివాసరావు ఉన్నారు. ఏటా గాంధీ జయంతిన ఇద్దరు ప్రముఖులకు గురుపీఠ నగదు పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు.

దంపతుల విశేష కృషి

సంస్థ ప్రగతికి కులపతి దంపతులు బోయపాటి నాగేశ్వరరావు, సుభద్రాదేవి విశేషంగా కృషి చేశారు. బోయపాటి సాహిత్యాలంకార పట్టభద్రుడు కాగా, సుభద్రాదేవి వార్ధా ఆశ్రమంలో శిక్షణ పొందిన 'వినీతా' పట్టభద్రురాలు. ఆరు దశాబ్దాలకుపైగా వీరు హిందీ భాషా వ్యాప్తికి సేవలందించారు. ప్రేమీమండలి కార్యదర్శి/ప్రిన్సిపల్‌గా చేసిన బోయపాటి నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచారసభ అధ్యక్షుడిగా, కేంద్రీయ హిందీ సంస్థాన్, ఆగ్రా విద్యాపరిషత్ సభ్యుడిగానూ విధులు నిర్వర్తించారు. హిందీ ప్రచారసభ వెలువరించే పూర్ణకుంభ, స్రవంతి





బోయపాటి నాగేశ్వరరావు - సుభద్రాదేవి దంపతులు (ఫైల్)

పత్రికలకు సంపాదకుడిగానూ చేశారు. వీరి కృషికి భారత ప్రభుత్వం నుంచి 'గంగా శరణ్ సింహ్' అవార్డును నాటి రాష్ట్రపతి అందించారు.

క్లుప్తంగా

యువత స్పందన అభినందనీయం



మంగళగిరి: ఏ టూ ఏ రన్‌లో యువత పెద్ద ఎత్తున పాల్గొనడం అభినందనీయమని సినీ నటుడు నిఖిల్ పేర్కొన్నారు. గుండె జబ్బులపై అవగాహన, మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం, అందరి కోసం అమరావతి పేరుతో ఎన్ఆర్ఐ జంక్షన్ నుంచి ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. 3కే, 5కే, 10కే రన్‌లను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఒక్క పిలుపునిస్తే 5 వేల మంది రన్‌లో పాల్గొనడం అభినందనీయం అన్నారు. జీవన శైలిలో మార్పులే పలు వ్యాధులకు కారణమన్నారు. అందరూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు యూనివర్సిటీలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలను కట్టడి చేసేందుకే పోలీస్ పెట్రోలింగ్



బాపట్ల టౌన్: నేరాలను కట్టడి చేసేందుకే పోలీసులు రాత్రిళ్లు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఎస్ఐలు, సీఐలు ఆదివారం రాత్రి గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ జిల్లాలో నేరాల్ని సమర్థంగా కట్టడి చేసేందుకు పెట్రోలింగ్, గస్తీలను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. రాత్రిళ్లు అనవసరంగా వీధుల్లో తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో నేరాలకు పాల్పడిన పాత నేరస్తుల కదలికల్ని నిశితంగా గమనిస్తున్నామని, అనుమానితుల్ని తనిఖీ చేసి విచారిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణం కల్పిస్తూ నేరాల్ని కట్టడి చేసేందుకు రాత్రి సమయాల్లో నిర్వహిస్తున్న పోలీస్ గస్తీకి జిల్లా ప్రజలు కూడా సహకరించాలని ఎస్పీ కోరారు. రాత్రిళ్లు సంచరిస్తున్న అనుమానితుల్ని విచారించే సమయంలో పోలీసులు అడిగిన వివరాలను తెలపాలని ఆయన సూచించారు. అనుమానిత ప్రాంతాల్ని విస్తృతంగా తనిఖీ చేయాలని, ఏటీఎం, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లను తరచూ సందర్శించాలని సిబ్బందిని ఆదేశించారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

- రాత్రి 8 తర్వాత కనిపిస్తే కఠిన చర్యలు
- నేరాల ఆలోచన కూడా రావొద్దు
- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చిక్కినా చర్యలే
- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్
- పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రౌడీషీటర్లు, వారి కుటుంబసభ్యులతో ప్రత్యేక సమావేశం



రౌడీషీటర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: గుంటూరు పశ్చిమ, తూర్పు సబ్ డివిజన్లలోని సుమారు 500 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు వారి కుటుంబ సభ్యులతోనూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడారు. తొలుత రౌడీషీటర్ల పేర్లు, గతంలో చేసిన నేరాలు, ప్రస్తుత వృత్తి, వారి ప్రవర్తన, స్థానికులతో ఎలా ఉంటున్నారంటూ తల్లిదండ్రులను, భార్య, పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రౌడీషీటర్లపై ఉన్న కేసుల తీవ్రత, చెడు అలవాట్లు వంటి విషయాలను కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. అందరూ సత్ప్రవర్తనతో మెలిగేలా చూడాల్సిన బాధ్యత ఉందని వారికి స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే పశ్చిమ, తూర్పు డీఎస్పీలకు లేదా తన దృష్టికి తేవాలని సూచించారు. మళ్లీ నేరాలు, హత్యల జోలికి వెళ్లవద్దని, జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. నగరంలో నివసించే రౌడీషీటర్లు రాత్రి 8 గంటల తర్వాత కనిపిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడినా కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. రౌడీషీటర్ల నడవడికపై తల్లిదండ్రులు, భార్య, పిల్లలు ఎప్పటికప్పుడు గమనించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించవద్దని సూచించారు. పోలీస్ శాఖ తోడుగా ఉంటుందని, తామేమీ శత్రువులం కాదన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. వివాదాల జోలికెళ్లినా, ప్రేరేపించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలని, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. రౌడీషీటర్ల పిల్లలకు పాఠశాలలు, కళాశాలల్లో విద్య తర్వాత ఎన్‌ఓసీ ఇవ్వాల్సి ఉంటుందని, కావున సత్ప్రవర్తనతో ఉండాలన్నారు. పిల్లలు ఇంజినీర్లు, వైద్యులు, న్యాయమూర్తులని గర్వంగా చెప్పుకొనేలా జీవించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు అబ్దుల్ అజీజ్ (తూర్పు), జయరాం ప్రసాద్, బి.సీతారామయ్య (ఎస్‌బీ), సీఐలు మధుసూదనరావు (నగరంపాలెం పీఎస్), శివప్రసాద్ (లాలాపేట పీఎస్), వీరయ్య (కొత్తపేట పీఎస్), సోమయ్య (పాత గుంటూరు పీఎస్), కె.శ్రీనివాసరావు (అరండల్‌పేట పీఎస్), పట్టాభిపురం పీఎస్ ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దౌర్జన్యమేంటి?

- దళిత కార్డుపై ఎమ్మెల్యే అయ్యాక ఇప్పుడు వారినే అణగదొక్కటం హేయం
- వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్



గుంటూరు రూరల్: తనకు ఓటు వేసిన దళితులకు మాత్రమే పథకాలు వంటివి అందాలని, మిగతావారికి ఇవ్వొద్దని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేయటం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు దళిత కార్డుతో ప్రస్తుత పదవి పొందారని, అదే దళిత కార్డుతో ఐఏఎస్ బాధ్యతలు నిర్వర్తించారని గుర్తు చేశారు. ఇటీవల గొట్టిపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో తన సామాజిక వర్గం వారు కొందరు తనకు ఓటు వేయలేదని ఆయన పేర్కొన్న విషయం గుర్తుచేశారు. అలాంటి వారికి అధికారులు ప్రభుత్వ పరంగా సాయం చేయరాదని పేర్కొనడం ఆయన సంస్కారాన్ని తెలియజేస్తుందన్నారు. దళిత కార్డుతో పదవులను పొంది.. అదే దళితులను అణగదొక్కాలని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న ఎమ్మెల్యే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు బలహీన వర్గాలను ఓటు బ్యాంకుగా చూడటం తెలుగుదేశం పార్టీకి పరిపాటేనని మండిపడ్డారు. ఎమ్మెల్యే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని.. లేకుంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఒక ఐఏఎస్ స్థాయి అధికారిగా పనిచేసి ఎవరితో ఏ విధంగా మాట్లాడాలో కూడా తెలియని వ్యక్తి రాజకీయాల్లోకి వచ్చి పదవులను అధిరోహిస్తే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. ఈ వ్యవహారంతో అది అర్థం అవుతోందన్నారు.

వివాహితను మోసగించిన వ్యక్తిపై కేసు

తాడికొండ: వివాహితను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి నగదు, బంగారం తీసుకోవడంతో పాటు చంపుతానని బెదిరించిన కేసులో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వాసు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. తాడికొండ మండలం ఫణిదరం గ్రామానికి చెందిన తాడవాతి నవీన్ కుమార్.. అదే గ్రామానికి చెందిన వివాహితను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. శారీరకంగా దగ్గరయ్యాక బంగారు నగలు, రూ.34.50 లక్షల నగదు తీసుకున్నాడు. పెళ్లి గురించి అడిగితే చేసుకోనని చెప్పాడు. పైగా ఆమెను, పిల్లలను చంపుతానని బెదిరిస్తుండటంతో ఆత్మరక్షణ కోసం తాడికొండ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఎస్ఐ సత్యన్నారాయణ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేటి నుంచి అందుబాటులో ఉచిత ఇసుక

గుంటూరు వెస్ట్: గృహ నిర్మాణ వినియోగం కోసం సోమవారం నుంచి ఉచిత ఇసుక అందుబాటులో ఉంటుందని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని ఆన్‌లైన్‌లో నగదు చెల్లించాలని పేర్కొంది. సొంత వాహనం కలిగిన వారికి ఇసుక ఇస్తామని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఇసుక లభ్యమయ్యే పాయింట్ నుంచి తెచ్చుకోవాలన్నారు. మిగతా వారికి ప్రభుత్వం వాహనాలు సమకూరుస్తుందని, రవాణా చార్జీలు వారే చెల్లించుకోవాలని పేర్కొన్నారు.

పరిహారం అందకుంటే ఫిర్యాదు చేయండి

ఇటీవల భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన వారి గురించి ఇప్పటికే ఎన్యుమరేషన్ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపామని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నష్టపరిహారం ఈ నెల 25 నుంచి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోందని గుర్తుచేశారు. ఎన్యుమరేషన్‌పై సందేహాలు, ఫిర్యాదులు సోమవారం నుంచి శుక్రవారం వరకు అందజేయవచ్చని తెలిపారు. గుంటూరు కలెక్టరేట్, తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం, గుంటూరు ఆర్డీఓ కార్యాలయాలతోపాటు అందుబాటులో ఉన్న తహసీల్దార్ ఆఫీసుల్లో ఈ సదుపాయం ఉందని పేర్కొన్నారు. వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

సీపీఎం నేత ఏచూరి చిరస్మరణీయుడు

నరసరావుపేట ఈస్ట్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిరస్మరణీయుడని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ పేర్కొన్నారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో సీపీఎం పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. తొలుత ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గఫూర్ మాట్లాడుతూ ఏచూరి లేని లోటు దేశ రాజకీయాలకు, కమ్యూనిస్ట్ ఉద్యమాలకు తీరని లోటన్నారు. కార్మిక, కర్షక సమస్యల మీద నిరంతరం పోరాటం చేశారని వివరించారు. రాజ్యసభకు రెండుమార్లు ప్రాతినిధ్యం వహించారని ఆయన సలహాలు, సూచనలు అధికారపక్ష సభ్యులు, ప్రతిపక్ష సభ్యులు కూడా హుందాగా స్వీకరించేవారని వివరించారు. యూపీఏ పాలనలో ప్రజలకు, కార్మికులకు, విద్యార్థులకు ఉపయోగపడే చట్టాలు తీసుకొచ్చేందుకు కృషి చేసి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి దేశరాజకీయాల్లో తనదైన ముద్రవేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి జి.విజయకుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, నాయకులు కాసా రాంబాబు, గద్దె చలమయ్య, ఏవీకే దుర్గారావు పాల్గొన్నారు.

సినీ నటుడు కోన గోవిందరావు మృతి



బాపట్ల: సినీ నటుడు, నాటక రచయిత, దర్శకులు, వ్యాయామ ఉపాధ్యాయులు కోన గోవిందరావు(80) హైదరాబాద్‌లో మృతి చెందారు. మాజీ గవర్నర్ కోన ప్రభాకరరావు పెద్ద కుమారుడు, మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి సోదరుడైన గోవిందరావు కళారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఆయన మృతి కోన కుటుంబానికి తీరని లోటుగా పలువురు సంతాపం తెలిపారు. అక్షింతలు, రూల్స్ ఒప్పుకోవు, రాజీనామా వంటి ఉత్తమ నాటకాలు గోవిందరావు రచించారు. ఆయన మృతి పట్ల రావూరి నరసింహవర్మ, ఆదా షఫీ, మాల్యాద్రిరావు, కస్తూరి శ్రీనివాసరావు, కామరాజుగడ్డ శ్రీనివాసరావు తదితరులు సంతాపం తెలిపారు.

దసరాకు పీఆర్సీ, డీఏ ప్రకటించాలి

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



మాట్లాడుతున్న కేఎస్ఎస్ ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు దసరాకు నూతన పీఆర్సీతోపాటు డీఏను ప్రకటించాలని ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్లో సంఘ జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాలను బట్టి జేఏసీ భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయిస్తామని చెప్పారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ, ఇతర బకాయిల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామని అన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీలు, పీఎఫ్ సాధన, పోస్టుల అప్‌గ్రేడేషన్ కోసం నాలుగు దశల్లో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఎంఈవో-1 పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం పెరిగిపోయిందని, దీని ప్రభావం బోధనపై పడుతోందని, తక్షణమే ఆయా యాప్‌లను రద్దు చేయాలన్నారు. పాఠశాలల నిర్వహణకు గ్రాంటు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి ఎండీ దౌలా, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, కె.సాంబశివరావు, ఎం.గోవిందయ్య, టి. ఆంజనేయులు, యు.రాజశేఖర్ రావు, జీవీ ధనలక్ష్మి, కె.కేదార్నాథ్, ఎ.శ్రీనివాసరావు, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కోటిరెడ్డి, కె. ప్రేమ్ కుమార్, కె.ప్రభుజీ, జి.జితేంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఎన్‌యూలో జాతీయ సదస్సు



ఆచార్య నాగార్జున యూనివర్సిటీ

ఏఎన్‌యూ: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వైస్ చాన్సలర్, తత్వవేత్త ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభం కానుంది. ఈ మేరకు వీసీ ఆచార్య కె.గంగాధర రావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఆదివారం తెలిపారు. 'పద్మ విభూషణ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానంద మూర్తీస్ విజన్ ఆన్ ఫిలాసఫీ ఆఫ్ ఎడ్యుకేషన్: రిఫ్లెక్షన్స్ ఆన్ ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఎడ్యుకేషన్ పాలసీ అండ్ ప్లానింగ్ ఇన్ ఇండియా' అంశంపై సదస్సు ఉంటుందన్నారు. ప్రారంభోత్సవానికి మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు మండలి బుద్ధ ప్రసాద్, ధూళిపాళ్ల నరేంద్ర, యూపీఎస్సీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ కేఎస్ చలం విశిష్ట అతిథులుగా హాజరవుతారు. ఢిల్లీ యూనివర్సిటీ ఫిలాసఫీ విభాగ విశ్రాంత ఆచార్యుడు అశోక్ ఓరా కీలకోపన్యాసం చేస్తారు. పలు వర్సిటీలు, తాత్విక సంస్థల నుంచి 40 వరకు పరిశోధనా పత్రాలు సమర్పించనున్నారని సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు తెలిపారు. ప్రారంభోత్సవ సభ ఉదయం 10.30 గంటలకు మొదలవుతుందన్నారు.

వర్గీకరణ పేరుతో విడదీయటం అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న శశిభూషణ్

తెనాలి: ఐకమత్యంగా మెలుగుతున్న మాల, మాదిగలను వర్గీకరణ పేరుతో విడదీయడం అన్యాయమని మాల మహానాడు జేఏసీ నేత, హైకోర్టు న్యాయవాది బి.శశిభూషణ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, తెనాలి డివిజన్ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం అయితానగర్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు కమ్యూనిటీ హాల్లో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పిల్లి విద్యాసాగర్, గెడ్డటి సుందర్ సునీల్ అధ్యక్షత వహించారు. శశిభూషణ్ మాట్లాడుతూ.. వర్గీకరణ అంశం రాజ్యాంగపరంగా సాధ్యమా? కాదా? అనే అంశంపై ఉద్యోగులు, ప్రజాస్వామ్యవాదుల మధ్య సమగ్ర చర్చ జరగాల్సి ఉందన్నారు. తద్వారా ప్రజలు సుప్రీంకోర్టు తీర్పును అర్థం చేసుకుని తమ హక్కులను కాపాడుకునేందుకు చైతన్యవంతులు కాగలరని అన్నారు. వర్గీకరణ అంశం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషను రూపంలో పెండింగులో ఉందని, అక్టోబరు నెలలో విచారణకు వచ్చే అవకాశం ఉందన్నారు. జేఏసీ నాయకులు కారుమంచి రవికుమార్, పంతగాని రమేష్, దాసరి చెన్నకేశవులు, పాండుగల చైతన్య తమ ప్రసంగాల్లో కుట్రపూరిత రాజకీయాలతో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలను వర్గీకరణ చేస్తే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో బండికళ్ల బుల్లయ్య, బొనిగల ప్రదీప్, కంచర్ల కోటేశ్వరరావు, అక్కిదాసు కిరణ్ కుమార్, కనపర్తి అబ్రహం లింకన్, కారుమంచి సునీల్ సందీప్, గోవతోటి మనోజ్, యంద్రపాటి అశోక్‌కుమార్, వేము సమత, కారుమంచి భానుప్రకాశ్, కంచర్ల అజయ్ కుమార్, మధిర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా ఔషధాల వినియోగం తగదు



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ బాలాజీ వీరరాఘవన్

గుంటూరు మెడికల్: ప్రజల ఆరోగ్యం నేడు ప్రమాదంలో పడిందని, యాంటీ బయాటిక్స్ అడ్డగోలు వాడకమే దీనికి కారణమని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రజల ప్రాణాలకు ప్రమాదమని తెలిపారు. పరిశోధన చేసిన పలువురు వైద్యులు గుంటూరులో జరిగిన సీఎంఈలో ఈ వివరాలు వెల్లడించారు. ఆదివారం గుంటూరులో అసోసియేషన్ ఆఫ్ సెప్సిస్ అండ్ క్రిటికల్ కేర్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో క్రిటికల్ కేర్ అండ్ ఇన్‌ఫెక్షియస్‌పై జోనల్ నిరంతర వైద్య విద్య కార్యక్రమం(సీఎంఈ) జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాయవెల్లూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ అండ్ సర్వేలెన్స్ డివిజన్‌కు చెందిన డాక్టర్ బాలాజీ వీరరాఘవన్ మీడియాతో మాట్లాడారు. నేడు ఇన్‌ఫెక్షన్ చాలా తీవ్రంగా ఉందని, కరోనా మరణాల కంటే దీనివల్ల మరణాలు అధికమని ఆందోళన వ్యక్తం చేశారు. విచ్చలవిడిగా యాంటీ బయాటిక్స్ వాడుతున్నారని, గ్రామీణ ప్రాంతాల్లోనూ వినియోగం అధికంగా ఉందన్నారు. ఇన్‌ఫెక్షన్లకు చికిత్సపై గుంటూరు హెల్ప్ హాస్పిటల్స్‌కు చెందిన స్పెషలిస్ట్ డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తితో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది తమ అసోసియేషన్‌ను అధికారికంగా ప్రకటిస్తామన్నారు. కోళ్ల బరువు పెంచేందుకూ యాంటీ బయాటిక్స్ మందులు వాడుతున్నారని, ఇది చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు. కోళ్ల దాణాను చౌకగా వస్తుందని చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నారని, అందులోనూ యాంటీ బయాటిక్స్ ఉన్నట్లు తెలిపారు. చికెన్ ఫీడ్‌లో 90 శాతం ఇలా ఉంటే, ఆక్వాలో 10 శాతం వాడుతున్నట్లు వెల్లడించారు. జోనల్ సీఎంఈ కన్వీనర్ డాక్టర్ కోగంటి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. చిన్న అనారోగ్యానికి యాంటీ బయాటిక్స్ వాడటం మానేస్తేనే మంచిదన్నారు. ముంబైకి చెందిన డాక్టర్ వసంత్, చెన్నైకు చెందిన డాక్టర్ సురేష్, డాక్టర్ దేదీప్యం, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ గన్‌శ్యామ్, డాక్టర్ విశ్వేశ్వరన్, విశాఖపట్నానికి చెందిన డాక్టర్ మోహన్ మహరాజ్‌లు పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో సీఎంఈ ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ ఎన్. శిల్పా చౌదరి, డాక్టర్ కె. రామకృష్ణప్రసాద్, డాక్టర్ నీరస్ రావెల, ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ బాలినేని సాయికృష్ణ, జాయింట్ సెక్రటరీ డాక్టర్ చంద్ర రాధికారాణి, మాజీ సెక్రటరీ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, ఏపీ మెడికల్ అబ్జర్వర్ డాక్టర్ గాదె కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోటి విత్తన బంతులు తయారీ లక్ష్యం



విత్తన బంతులు తయారు చేసిన విద్యార్థులతో వాసవి క్లబ్ ప్రతినిధులు

కారెంపూడి: భారత దేశానికి స్వాతంత్ర్యాన్ని సముపార్జించిన మహాత్మాగాంధీ జయంతి నాటికి కోటి విత్తన బంతులు తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ద్వారా మహాత్మునికి నిజమైన నివాళి అవుతుందని భావించి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కారెంపూడి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఐదు వేల విత్తన బంతులు తయారు చేసి ఇచ్చారని అలాగే ప్రతి పాఠశాల, కళాశాల విద్యార్థులు, సేవా సంస్థల సహకారంతో కార్యక్రమాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ విత్తన బంతులను చిట్టడవులు, ఇతర అటవీ ప్రాంతాలలో చల్లుతామని పేర్కొన్నారు. వీటితో పాటు మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

ముగిసిన టైప్ రైటింగ్ పరీక్షలు

రేపల్లె రూరల్: ఏపీ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్, మంగళగిరి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న టైప్ రైటింగ్ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇంగ్లిష్ జూనియర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్, తెలుగు హయ్యర్ గ్రేడ్‌లకు రెండో రోజు 41 మందికి గానూ 38 మంది హాజరయ్యారని తెలిపారు. మొదటి రోజు 37 మందికి గాను 31 మంది హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

జేఎన్‌టీయూఎన్‌లో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



వేడుకల్లో విద్యార్థుల డాన్స్‌లు

నరసరావుపేట రూరల్: కాకాని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ క్యాంపస్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. సినీ పాటలకు నృత్యాలు చేస్తున్న సమయంలో కేరింతలు, చప్పట్లతో కళాశాల ప్రాంగణం మార్మోగింది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులను తెలుసుకునేందుకు, తరగతి గది వెలుపల సహచర విద్యార్థులతో బంధం ఏర్పడేందుకు కార్యక్రమం వేదికగా నిలుస్తుందని తెలిపారు. కేవలం చదువులోనే కాకుండా అన్ని అంశాలల్లో చురుగ్గా పాల్గొనాలని విద్యార్థులను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీలల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ జీపీ రాజు, డాక్టర్ కె.విమల్‌కుమార్, డాక్టర్ ఎ.గంగాధర్, డాక్టర్ ఐ.ఫణిసుష్మ, సురేంద్ర పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పొన్నూరు: పట్టణంలోని బాపట్ల రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈతేరు గ్రామం నుంచి పొన్నూరుకు వస్తున్న ప్యాసింజర్ ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న తెనాలి మండలం సంగంజాగర్లమూడికి చెందిన జిలపేగుల రాజేష్ బాబు (30) ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నాదెండ్ల: చోరీ కేసులో నిందితుడిని యడ్లపాడు పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఎస్ఐ వి.బాలకృష్ణ తెలిపిన వివరాలు.. ఈ ఏడాది జూలై 23న యడ్లపాడులోని పోలీస్‌స్టేషన్ సమీపంలో నివసించే డేరంగుల దేవి నివాసంలో చోరీ జరిగింది. 40 గ్రాముల బంగారం వస్తువులు చోరీకి గురయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు రఘునాథం కిరణ్ చోరీ చేసిన వస్తువులను ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో తాకట్టు పెట్టి నగదు తీసుకున్నాడు. పోలీసులు దర్యాప్తులో తేలటంతో నిందితుడిని అరెస్టు చేసి చోరీకి గురైన వస్తువులను స్వాధీనపరచుకున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు స్కూల్ టీచర్ మృతి

వినుకొండ(నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు స్కూల్ టీచర్ మృతి చెందాడు. వివరాలు.. పట్టణంలోని సిద్ధార్థనగర్‌లో నివాసండే దోపర్లపూడి నార్ల అప్పారావు(32) ఓ ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. అప్పారావు గత రాత్రి ద్విచక్ర వాహనంపై వస్తుండగా నరసరావుపేట రోడ్డులోని డివైడర్‌ను ఢీకొని మృతి చెందాడు. బైక్‌కు ఆవు అడ్డురావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య మాణిక్యం, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతి ఘటనపై అర్బన్ సీఐ శోభన్‌బాబు కేసు నమోదు చేశారు.